


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"**మీతో మాట్లాడవలసిన** ముఖ్య విషయాలున్నాయి, రాయుడు గారూ!"

కొండంతకోపాన్ని ఎలా దిగమింగగలిగాడో రాయుడికి తెలియలేదు. ఆ పని చేసేసి అతి నెమ్మదిగా, కేవలం అనంతం చెవులకు మాత్రమే వినబడేట్టు, మూడో చెవికి వినబడకుండా ఉండేట్టు, అనంతం శ్రేయోభిలాషిలా లేక శత్రువులా ఇలా అన్నాడు:

"పానకంలో పుడకలా వచ్చి, ఊరూ పేరూ, ముక్కూ మొహం నాకు తెలియని వీధిమనిషి నా గుమ్మం ముందు నేనేదో వాడికి బాకీ ఉన్నట్టు నిలబడి నాతో మాట్లాడాల్సిన విషయం ఉంది అంటే, ముందుకు ఎర్ర తివాచీ దొర్లించి లోపలి ఆహ్వానిస్తాననుకున్నావా?"

అలా అనడమే కాక వెనక్కు అడుగేసి తలుపును మూసెయ్యబోయాడు. దాన్ని ఊహించినట్టు, లోపలి అడుగేసి చేతులు అడ్డుపెట్టి వాటితోటి తన శరీరంతోటి తలుపును అడ్డుకున్నాడు అనంతం. దెబ్బ తగిలినా బాధను దిగమింగుకున్నాడు కత్తి తీసే ప్రయత్నం చేయకుండా.

"నా కొడకా!"

"ఇంతవరకూ ఇంకొకరిని తండ్రిగా భావిస్తూ వచ్చానన్నమాట. అంతకు మించి మీరు అధికంగా తిట్టకుండా ఉంటే మీ బతుకును కొనసాగించే వీలుంటుంది."

తను మూయబోయిన నా తలుపు వల్ల అనంతానికి తగిలిన దెబ్బ ను పట్టించుకోకుండా తన ఇంటిలోకి అలా అతను జారపడడం విభ్రాంతి కలిగించింది. దాన్నిదౌర్జన్యంగా భావించాడు. పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేద్దామనిపించి తమాయించుకున్నాడు. దొంగ తన ఇంట్లో అడుగు పెట్టినా ఫర్వాలేదు గానీ, పోలీసు నా కొడుకుల్ని ఎప్పుడు రానీయ

కూడదు అని అతనిని నిశ్చితాభిప్రాయం. పైగా ఒక గలబాగా మారి అందరికీ అది వినోదాన్ని ఇస్తుంది, వంద కళ్ళు అతనిని చూస్తాయి.

"రాయుడు గారు, నాతో మాట్లాడటం మీకే ఎక్కువ మేలు చేస్తుంది నాకన్నా. సరే నిజం చెప్పాలంటే మీకు జరగబోయే కీడు ఆగిపోతుంది – అలా జరగడము మీకు మేలైనట్లే కదా?"

" నీవు బ్లాక్ మెయిల్ చేయడానికి వచ్చావని తెలుస్తోంది."

"బ్లాక్ మెయిలుకు ఎవరైనా ఎందుకు లొంగుతారు? లొంగి పోవడం వలన జరగవలసిన కీడును ఆపుకో వచ్చనే కదా. అది ఒక వ్యాపారం. మీరు లంచం తీసుకోవడం లాగానే. లంచం ఏ వెధవ ఊరికే ఇవ్వడు. అలా ఇచ్చినట్లయితే దాని పేరు దానం అవుతుంది."

"ఇంతకు ఏమిటా విషయం?"

"మీరు వ్యవహారశీలయితే తలుపు పక్కన నిలబెట్టి అడగరు? నేను కూర్చుంటే మీ సోఫా మైల పడుతుందా?"

“నీ.....కు.

“మన ఇద్దరికీ పరిమితమైన వ్యవహారంలోకి నా అమ్మనో, ఆలీనో లాగడం మర్యాదగా ఉండదు కదండీ, రాయుడు గారు? అన్నట్టు దానిగుండానే మనం ఈ భూమ్మీదికి దొర్లాము. అది నీచమైందంటారా?"

"వీధి కుక్కని ఇంట్లోకి ఎవరు రానిస్తారు?"

"నన్ను వీధి కుక్క అన్నా, మురికి పంది అన్నానాకేం అవమానకరం కాదు. సృష్టిలోని, సృష్టిలో లేని ఏ జీవితో నన్ను పోల్చిన బాధపడను. అతిథి దేవోభవ; అతిథి పూజకు అర్హుడు. గతంలో అతిథి పక్కన సొంత భార్యనే పడుకో పెట్టడం ధర్మం. గృహస్థుగా ఉండటం కన్నా అతిథిగా బతకడమే వాంఛనీయమేమో!"

" వీధి కుక్కలకు చేయవలసిన పూజ ఒకటి ఉంది. బడిత పూజ."

"చెయ్యండి ఫర్లేదు. సోఫాలో కూర్చోబెట్టి నేను చెప్పింది విన్న తర్వాత మీకు ధైర్యం ఉంటే అలాగే చేదురు గాని.

అనంతం గుండెలు తీసిన బంటులా కనిపించాడు రాయుడికి. ప్రేమలత ఈ సమయాన కూడా ఇంట్లో లేకుండా పోవాలా? ఏమో ఆమె లేకపోవడమే మంచిదేమో. రాజుకన్నా మొండివాడు బలవంతుడని విన్నాడు. వీడు మొండి వాళ్ళకే మొండి వాడిలా ఉన్నాడు. వాడి దగ్గర ఏదైనా ఆయుధం కూడా ఉండి ఉంటుంది. ముందు నుయ్యి వెనుక గొయ్యిలా వీడిని లోపలకి రానిస్తే ఏం ప్రమాదమో, రానీయకుండా ఏదోలా బయటకి పంపేస్తే తదుపరి ఏం కొంప ముంచుతాడో. ఇంటిముందు గలబా చెయ్యోచ్చు, లేదు ఏదో తన గుట్టు తెలిసి తద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నాడు గనుక, లబ్ధి చేకూరదని తేలిపోతే గుట్టును రట్టు చెయ్యోచ్చు. ఇంతకూ ఆ గుట్టు ఏమయి ఉండొచ్చు? పెరుమాళ్ళకే తెలియాలి, నటుడు కాదు దేవుడు.

"సరే లోపలికిరా. వెర్రి మొర్రి వేషాలు వేస్తే ఊరుకోను. నీకు ఐదు నిమిషాల వ్యవధి మాత్రమే ఉంటుంది. వేళకాని వేళలో దున్నపోతులా ఇంట్లో జొరబడడం ఏం రోగం?"

"ఆ రోగం పేరు నాకు తెలియదు. ఇరువురికి లాభం చేకూరే విషయం, ఆలస్యం చేయకూడని విషయం ఉన్నప్పుడు మీనమేషాలు లెక్కిస్తూ తాత్సారం చేయడం విజ్ఞత అనిపించుకోదు. కుక్క, పంది అన్నారు. క్షణం గడిచిందో లేదో దున్నపోతు అన్నారు. ప్రియాతి ప్రియమైన స్త్రీ జననాంగాన్ని మీ నోట్లోకి తెచ్చుకున్నారు. మీ నోటికి దూల ఎక్కువ అనుకుంటా, మీలా దిగజారుడు భాష మాట్లాడలేని అసమర్థత నా నోటికి ఉందని మీ భావన కావచ్చు."

ముందు అతను దారి తీస్తుంటే లోపలికి అడుగు పెట్టాడు అనంతం అది రాయుడి ఇల్లులా కాక తన ఇంట్లో తనే నడుస్తున్నట్లు, చేతులు ఊపుకుంటూ. కొన్నప్పుడు అపార్ట్మెంట్ సాధారణంగానే ఉండి ఉంటుంది. ఇప్పుడు దాని మీద మయుడి చేయి పడ్డట్లు మతి పోగొట్టేట్లుంది; సుయోధనుడికి మయసభ మతి పోగొట్టినట్టు. పువ్వు పువ్వు తిరిగి తుమ్మెద మకరందాన్ని దోచి, కూడబెట్టినట్లు; తిరిగి తిరిగో వెదికివెదికో, అప్పనంగా దొరికినవాటినల్లానో, కొన్నవాటినో వస్తువులను ఇక్కడ చేర్చి పెట్టాడు. మనిషి అంటే లేని మమకారం వస్తువు అంటే ఎంతో. పాదాలు ఎర్రతివాచీలో దిగబడుతున్నాయి. గోడలకు పటాలు, విగ్రహాలు. కళా సంబంధమైన ఖరీదైన వస్తువులు గది మూలల్లో సర్ది ఉన్నాయి. ప్రేమలత లేదేమో. ఉండుంటే ఇంట్లో ఎవరు వచ్చారా అని తొంగి చూడదా? సరే ఉన్నా ఇబ్బందేం లేదు. ఒక గదిలో దూరి రాయుడు, తాను వ్యవహారాన్ని తేల్చుకోవచ్చు.

"ఇదిగో, చూడు నీకు ఐదు నిమిషాలు కాలాన్ని మాత్రమే నేను వెచ్చించ గలను. అది గుర్తుంచుకుంటే మంచిది. పైగా నా భార్య ఏ నిమిషంలోనయినా రావచ్చు."

"కొందరు అనుభవించడానికే పుడతారు, ఆ అవకాశంలేదని ఏడుస్తూ గడపడానికి కొందరుద్భవిస్తారు," అన్నాడు అనంతం.

అతను మౌనంగా గోడ టీవీ ఆన్ చేశాడు. ఆరడుగుల దేహదారుఢ్యం ఉన్న స్త్రీ పురుషులు లైంగిక కార్యక్రమం ఆరంభించారు. మంగోలాయిడ్ లక్షణాలున్నాయి వాళ్లకు.

"అది నాకు అక్కర్లేదు అన్నాడు," అనంతం.

"నాక్కావాలి; నువ్ చూడటం మానెయ్యి."

“పోనీ నేను వెళ్లిపోయిన తర్వాత మీ అచ్చటా ముచ్చటా తీసుకోవచ్చుగా?"

"నీవు ఉన్నా లేకపోయినా నాకు ఒకటే; నిన్ను ఒక మనిషిగా గుర్తించడం లేదు కదా."

"మరి మాటలు మాత్రం ఎందుకు నాతో."

"గోడతో మాట్లాడుతున్న."

"గోడ మాటలకు సమాధానం ఇస్తున్నారా?”

"గోడ లాంటి నీకు; నీలాంటి గోడకు."

"ఈ అవమానాలన్నింటికీ మూల్యం చెల్లించుకొనే పరిస్థితి తెచ్చుకోకండి."

మాట్లాడకుండా టీవీ చూస్తూ ఆనందిస్తున్నాడ, మధ్యమధ్యలో పానీయం సమర్పయామి అన్నట్లు మందు నోట్లోకి తీసుకొని మింగుతూ. ఈ విధంగా నన్నా నాపై దెబ్బ కొట్టడానికి చూస్తున్నట్టున్నాడు వెధవ అని అనుకున్నాడు అనంతం.

“భారతీయులు పనికిరారా?"

"అది నీకు అనవసరమైన విషయం."

"నిజమే చాలా అనవసరం. కేవలం అనుమానాన్ని వ్యక్తం చేశాను మీరు తీరుస్తారని. మిమ్మల్ని ఆక్షేపించడం లేదు. నాకన్నా కనీసం పదిహేను ఏళ్ళు పెద్ద అయిన మీ దగ్గర నుంచి తెలుసుకోవాల్సిన విషయాలు ఉంటాయి."

"నీ అనుమానాలు తీరుస్తూ కూర్చోడానికి నాకు తీరుబడి లేదు."

మౌనం వహించాడు అనంతం. తీగ తెగే దాకా లాగితే పిల్లిని గదిలో పెట్టి కొట్టి చూస్తే – తీగ తెగి ఊరుకుంటుంది; పిల్లి మన కళ్ళను పీకి అంధులను చేస్తుంది. ఈ రెండింటి విషయంలో మనిషికి నాజూకుదనం అవసరం. పడగవిప్పిన పాము విషయంలో ఒక పాలు అధికంగా అది కావాలి.

“ప్రేమలత గారు పెందలాడే వస్తారా?"

"అర్ధరాత్రయితేగాని ఇల్లుచేరదని నీకేమైనా తెలిసిందా?"

ఎంతకూ రాయుడు కూర్చోమని అనేట్టులేదు. తనకు ఏది సౌకర్యంగా ఉంటె దానిసంగతి తానే చూసుకోడం ఉత్తమం అనిపించింది అనంతానికి. రాయుడిని అతనున్నచూటనే వదిలేసి, చౌరవగా సముద్రం వైపు ఉన్న బాల్కనీలో ఎదురెదురుగా వేసున్న ఒక కుర్చీలో కూర్చున్నాడు. రెండింటి మధ్య నగిషీలు చెక్కిన రోజ్ వుడ్ ముక్కాలిపీట ఉంది. దాని మీద కొంత సామాగ్రీ ఉంది. సోడాసీసా, వెండిపళ్ళెంలో మూతవేయ్యబడి ఏదో తినే పదార్థం, పొడవాటి నాజూకైన గాజు గ్లాసు, అందులో మిగిలి ఉన్న సుర, సుర సీసా, ఖరీదైన సిగరెట్టుపెట్టే. తూర్పువైపు దృష్టిమళ్లించాడు అనంతం. ఉప్పొంగుతున్న సముద్రం ఏదో సుఖాన్ని అనుభవిస్తున్నట్టు గిరిగీసుకుని – నేను చెలియలికట్టను తలచుకుంటే దాటగలను కానీ, దాటను అంటున్నట్టుంది. దక్షిణాన మోకరిల్లిన డాల్ఫిన్ కొండ. దూరంగా మునిగిపోతాయేమో నన్నట్టు ఎగిసిపడుతున్న నాటు పడవలు. అతను దృష్టిని మళ్లించి గదిలోకి చూశాడు. లైట్ కింద ఆయిల్ పెయింటింగ్ కనిపించింది.

"ప్రేమ గారిది కదూ?" దాన్ని వేలుతో చూపిస్తూ అన్నాడు.

"నీకెందుకా విషయం? నీకెలా తెలుసు? ఎప్పుడన్నా చూశావా ఆమెనూ?"

"లేదు. అల్లాబల్లమీద మీరిరువురూ కలిసి తీయించుకున్న ఛాయా చిత్రం కనిపిస్తోంది స్పష్టంగా. ఆ గోడకు వ్రేలాడే ఆమె, ఫొటోలో ఉన్నామే  ఒకే పోలికలతో ఉండటం వలన అలా భావించా? కవలలు కాదనుకుంటా. ఇంతకూ ఎవరు గీశారు దాన్నీ?"

"పేరు చెబితే నీకు తెలియదు కదా? విన్సెన్ట్ వాన్ గాగో, పికాసావో, గాగినో అంటే చిత్రకారుడెవరో నీకు తెలుస్తుంది."

అతను నిలబడున్నాడు. వాడి దగ్గిరికి వెళ్లి ఎదురు కుర్చీలో కూర్చోవాలి; అది ఇష్టం లేదు. వాడినే సోఫా మీదికి రమ్మని చెప్పాలి. ఇదీ ఇష్టం లేదు. కూర్చోవడానికి వీల్లేదు నిలబడే ఉండు ఆంటే వినడు. ఇంతలో అనంతం లేచి ఆ చిత్రపటం దగ్గిరికి వెళ్లి దానిమీదున్న సంతకం చదివి బాల్కనీలో కుర్చీని చేరాడు తిరిగి.

“స్త్రీలోలత కళాసృష్టికి దోహదం చేస్తుందని అర్థమవుతోంది. రంగాకు  చిత్రపటాలు గీయడం కూడా ఒచ్చన్నమాట."

"వీడితో మాటకు మాటా మాట్లాడటంకన్నా ఊరుకోడం ఉత్తమం అనిపించింది రాయుడికి. ప్రేమలత బతుకు తన బతుకు కూడా ఇక్కడికి రాబొయ్యేముందు అధ్యయనం చేసినట్టున్నాడు. వీడు లొంగేరకం కాదు అన్న తుది నిర్ణయానికి వచ్చాడు రాయుడు. డబ్బు కక్కుర్తి వీడిని ఇక్కడికి తెచ్చివుంటుంది. విషయం తెలుసుకుని దాన్ని వాడి మొహం మీద కొట్టి పంపితే పోతుంది.

"భోగం అంటే ఇలా ఉండాలి!"

"నీకు కావలిస్తే అదంతా తిని, తాగి, సిగరెట్టుపెట్టె పట్టుకుకుని ఐదు నిమిషాలలో వెళ్ళిపో."

"నాకు తాగడం, మందుకొట్టటం, పరాయిస్త్రీ పక్కన పడుకోడం – లాంటి అలవాట్లు లేవు. అంటే భోగించడం అలవాటు లేనివాడిని. విషయం ఆటో ఇటో తేల్చుకోడం ముఖ్యం నీకైనా, నాకైనా అంతేగాని కాలానికి కట్టుబడి ఉండటం కాదు. చెప్పాలంటే నాకూ వ్యవహారం త్వరగా తేల్చుకుపోవాలనే ఉంది; ఇక్కడ ఈ రాత్రి గడిపిపోవాలని లేదు."

"ఎవరి తరఫున తమరు ఇలా వేంచేశారో తెలియజెయ్యండి."

"మీరేమీ అనుకోకపోతే, నా ఎదురు కుర్చీలో కూర్చుని మీరు మధ్యలో వదిలివేసిన పనిని పూర్తిచేసుకోండి. నేను చెప్పాల్సింది చెబుతా."

"నీవెదురుగా ఉంటె విషం తప్ప ఏదీ రుచించదనుకుంటా."

"నేనూ అందగాడినే, రాయుడు గారూ. ఇది ప్రజాభిప్రాయం. సోత్కర్షకాదు. మీ మనసునడగండి. ఒకవేళ ఈ లోపల అనుకోని విధంగా ప్రేమలత గారొస్తే ఆమె అభిప్రాయాన్నీ తీసుకోవచ్చు. ఇకపోతే ఎవరు పంపగా నేనొచ్చానో తెలుసుకోవాలని మీకు సహజంగానే ఉంటుంది. నేను రాయుడి గారి స్థానంలో, రాయుడు గారు నా స్థానంలో ఉన్నా అది తెలుసుకోవాలన్న ఉత్సుకతతో చస్తాము. కానీ  నా మీద విశ్వాసం ఉంచి ఈ పనికి వినియోగించినవారిపట్లా విశ్వాస

ఘాతుకానికి పాల్పడ్డట్టవుతుది ఆ రహస్యం చెబితే. నీతిలేని వాడినే కానీ, నియమాలన్నా ఉండకుండా ఉండనుకదా? భవిష్యత్తులో నియమాలకూ తిలోదకాలొదులుతానేమో తెలియదు. మన గురించీకూడా మనకు చాలా విషయాలు తెలియవు. కానీ ఎవరు నన్ను పంపడానికి అవకాశాలున్నాయో వాటిలో కొన్నైనా చెబుతాను. మీరు లంచాలకై పీడిస్తున్న వాళ్లలో ఒకరు లేక కొంతమంది కలిసి మిమ్మల్ని తుదముట్టించాలని ప్రయత్నించవచ్చు. రంగాకానీ, లత గారు కానీ మిమ్మల్ని తమ దారినుంచి వీలైనంతగా తొలగించుకోవాలని భావించ వచ్చు. మీ కార్యా లయంలో మీరు అచ్చోసిన ఆంబోతులా తరిమి చేజిక్కించుకున్న స్త్రీయో, ఆమె అన్నదమ్ములో, కాస్తో కూస్తో పౌరుషముండి భార్య పరువుకన్నా ఆమె తెచ్చే డబ్బుమీద అధికమైన మక్కువుంటే ఉద్యోగం మాన్పించలేకపో యినభర్తో – ఎవరైనా కావుచ్చు. ధర్మరాజే అజాతశత్రువు కానపుడు రాయుడుగారెంత? ఎవరైనా మీ రక్తం కళ్ళ చూడలేక పోయినా తెగించి తెడ్డే లింగం అనుకునే నాలాంటివాడి సహాయం తృణమో పణమో ఇచ్చి తీసుకుని ఉండొచ్చు."

"నేను ఏమి చెయ్యాలో నీవు చెప్పినపుడు ఎవతె లేక ఎవడు నిన్ను ఈ పనికి వినియోగించిందీ గ్రహించలేకపోను," అని అతను అనంతం ఎదురుగా కూర్చున్నాడు.

"తెలియకుండా ఉండటానికి తగు జాగ్రత్తలు తీసుకోడం నా వృత్తి ధర్మం."

"నీకు ధర్మం అర్థం తెలుసన్నమాట."

"అర్థం తెలుసు, పాటించలేకపోయినా."

"డబ్బుకు కక్కూర్తిపడి నీవు దీనికి పూనుకున్నావని అర్థంకావడానికి మేధాశక్తి అవసరం లేదు."

"నాకు పైకం మీరిస్తే, మీకూ ఇలాంటి పనిచేసిపెట్టగలను. కావలిస్తే రంగా మీదికి ప్రయోగించుకోండి."

"నాకు డబ్బు తీసుకోడమేగాని ఇవ్వడం అలవాటు లేదు. డబ్బు గురించీ ప్రాణం ఒదిలెయ్యడానికి కూడా సిద్ధం నేను. రంగా వెంట్రుక నీవు తెంపలేవు నిన్ను నేను ప్రయోగించినా. ఆ అవకాశం ఏమాత్రమున్నా ఆ పనికి నేనే పూనుకునేవాడిని," తల విసిరి అన్నాడు రాయుడు.

"మీకు చేతకాని పనిని లోకంలో మరొకడెవ్వడూ చేయలేడనుకోడం మీ అజ్ఞానాన్ని చాటుతుంది."

"ఐతే నీవు నన్ను చంపబోతున్నావా?"

"ఆ విషయం మీ మీదే ఆధారడుంది."

"మారణాయుధముందా నీ దగ్గిర?"

"ఉంది."

"నా గురించీ కొత్తగా కొన్నావా?"

"అవును," అంటూ ఒకచేత్తో కత్తిని గట్టిగా పట్టుకుని చూపించాడు.

"నేను చావకుండా ఉండటానికి ఏమి కావాలోచెప్పెయ్యి; నా సమయం వృథా చెయ్యకు. కత్తికీ సుత్తికీ భయపడి ఒంటేలు  పోసుకునే రకం కాదు నేను."

"మీ చేత దాన్నిఎలా పోయించాలో నాకు తెలుసు. చావు కాక భయపెట్టేవి మరికొన్నున్నంటాయి. ఈ సందర్భంలో నాకు అర్థంగాని మీలోని మూర్ఖత్వం ఒకటుంది."

"చెప్పు."

"మరీ, నాకిచ్చిన సమయాన్ని పొడిగిస్తారా తమరు?"

"నేను నిన్ను హత్యచెయ్యలేనా? నా దగ్గిర కత్తిలేదా? నీకన్నా బలహీనుడినా? నాకు ధైర్యం లేదనుకుంటున్నావా?"

"తెగింపు కావాలి. మీరు అనుభవిస్తున్నజీవితం వేరు. అది మీకు తెగింపును ఇవ్వదు. హత్యచేసి కారాగారంపాలు అవనివ్వదు. నేను అనుభవిస్తున్న జీవితం వేరు; జీవించాలన్న ఆశ ఉండి ఉండొచ్చుగాని. నా జీవితంలాంటిది కొనసాగించడమూ, ఆపెయ్యడమూ ఒకలాంటివే. నా గురించీ కుక్క కూడా ఏడవదు. మీ గురించీ లత గారు కాకపోయినా మీ తల్లిదండ్రులో, పిల్లలో ఏడుస్తారు. కనీసం మీ పెంపుడు కుక్క. మీరు పోగేసే డబ్బు కేవలం మీరు అనుభవించడానికేగాక మీ భవిష్యత్తును ఉద్దేశించింది కూడా; లత గారు దానిని అనుభవించడం మీకు ఇష్టం లేకపోయినా. ఆమెను మీరు కట్టడి చేయలేని భీరువు. మీ ఇంట్లో మీరు హత్యచేస్తే నా శవాన్ని మాయం చెయ్యడం శ్రమతో కూడిన పని. నేను మిమ్మల్ని చంపి పారిపోవచ్చు. దొరికిపోతానా పోనా అన్నది మరో విషయం. నాలాంటి ఒక అనామకుడిని హత్యచేయడం వలన మీరు కోల్పోయేది ఎంతటి విలువైనదో మీకు తెలుసు."

"ఒక లుచ్చా నా ఇంటికి వచ్చి నన్ను బెదిరించి నన్ను హత్యచేయబోయాడు; నా ఆత్మారక్షణా ప్రయత్నంలో ప్రమాదవశాత్తు వాడు చచ్చాడు అని నా న్యాయవాదులు గడ్డిలా నా డబ్బు మేసి, న్యాయమూర్తిచేత కొంత తినిపించి నన్ను గట్టెక్కించేపని చేయగలరు. సుప్రీం కోర్ట్ దాకా వెళ్ళగలను."

"నన్ను మీరు చంపలేరు. మిమ్మల్ని మీరు నా నుంచీ రక్షించుకోలేరని భావించడంవలనే ఈ కత్తితో వచ్చా. అయినా హత్యకు దారి తీయకుండా నా పనిని ఎలా చక్కపెట్టుకోవాలో నాకు తెలుసు. నిజం ఇప్పుడు చెబుతున్నా కత్తివిషయంలో: అది నా ఆత్మరక్షణకు తెచ్చుకున్నా."

"నేను గాజుమేడలో ఉన్నా. నీవు వీధిలో తిరిగే పోరంబోకువి. నీకు గాజుమేడ మీద రాయి విసరి పట్టుబడకుండా వెళ్లడం అతి తేలిక. పేరు, ఊరు, చిరునామా లేవు; అందుచేత వాటిని దాచుకునే శ్రమకూడా నీకు లేదు."

"మీరు చెప్పింది అక్షరసత్యం. అందువలన నేను ఏమి చెబితే దానికి గంగిరెద్దులా తలూపెయ్యడం మీకు శ్రేయస్కరం. నా జేబులో ఒక జాబితా ఉంది, రాయుడు గారు. అదేంటో తెలుసా? మీ ఆస్తుల వివరాలు. మీ ఉద్యోగ నడవడి నిబంధనల ప్రకారం, చట్టాల ప్రకారం మీకు ఆదాయాన్ని మించిన ఆస్తులుండటం నేరం కూడా. చూస్తారా దాన్ని?"

"చుట్టచుట్టి ఎక్కడ వీలుంటే అక్కడ దోపుకో. నీవేమీ చెయ్యలేవు దాన్ని ఆయుధంగా ఉపయోగించి. నా పేరుతొ ఏ ఆస్తీ లేదు."

"ఈ ఫ్లాటు కూడానా? దీన్ని అవినీతి వ్యతిరేక శాఖవారు అంచనా వేస్తె కోటి ఉంటుందని తెలిసింది. మీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం ఇవ్వవలసిన ఆస్తి వివరాల పట్టికలో బహుశా ముప్పై లేక నలభై లక్షల విలువను చూపించారు. కొన్నప్పుడే విఫణిలో దాని వెల డెబ్భైలక్షలుంటుంది."

"ఏమి చేద్దామనుకుంటున్నావు నా ఆస్తి వివరాలతో?"

కొంటెగా ధ్వనిస్తూ రాయుడు అన్నాడు.

కానీ రాయుడి ఒళ్ళు చెమ్మగిల్లింది. ప్రస్తుతానికి రెండు విధాల అనంతం భయపెడుతున్నాడు. తన ఆస్తుల వివరాలతో ఫిర్యాదు చేస్తానని, హత్య చెయ్యడానికి వెనుదీయనని. డబ్బు అవసరమేమో! మొహం మీద కొట్టి పంపితే సరిపోతుంది, నిజమే. ఈ కథకు వాడు ఇంతటితో ముగింపు పలుకుతాడా? చూద్దాం ఇంకా వాడు ఏమి మాట్లాడుతాడో. వాడు పంజా తనమీద ఎత్తి ఉంచాడు. తాను పారిపోయే అవకాశం లేదు. వెనుదిరిగినా ముందుకు అడుగేసినా పంజా తనమీద పడుతుంది. అందుచేత ఉన్నచోట ఉండి మేకపోతు గాంభీర్యం వహించడం తప్ప చేయగలిగిందేమీ లేదు. వాడు పులికి, నక్కకూ పుట్టిన అక్రమ సంతానం. నక్కలా ఆలోచించగల పులి, పులిలా చీల్చి చండాడ గలిగిన నక్క. పులినైనా ఎదుర్కొన వచ్చు, నక్కనుంచైనా తప్పించుకోవచ్చు. రెండింటి సమ్మేళన వింత జంతువుకు లొంగిపోవడం తప్ప, మరో మార్గం లేదు.

"ఆ నీలిచిత్రం పరాకాష్ఠకు వచ్చినట్టుంది టీవీ ఆపెయ్య కూడదు?"

"రిమోట్ తో టీవీ కట్టేశాడు. వీడు భోగాలు అన్నింటిలో మునిగితేలుతున్నపుడు పానకంలో పుడకలా తగిలాను. పైగా వాడు సర్దుకుని వచ్చేలోగా తలుపు విరగ్గొట్టబోయాను మరికొంత వాడు తాగుంటే తలుపులు తీసినవెంటనే కడుపులో తన్నుండేవాడేమో.

"కృపారావు భార్య పేరేమిటి? సరే నాకు అనవసరం. ఆమె కొనిపించిన ఆమె పొలం దగ్గిరున్న నీ పొలం ఖరీదెంత ఉండొచ్చు?"

"ఆమె ఎలా తెలుసు నీకు?"

"బీచి రోడ్డులో మీ ఇరువురినీ చూస్తుండటం వలన. పిల్లి పాలు తాగుతూ అనుకున్న చందాన మిమ్మల్ని ఎవరూ చూడటం లేదని మీరనుకుంటే చాలా? బహుశా కృపారావు దృష్టిలోనే మీరిరువురూ పడుందరు."

"కృపారావు ఎలా తెలుసు?"

"ఆమె భర్తగా తెలుసు. ఇద్దరితోటి పరిచయం లేదు. భార్య మరొకడితో తిరుగుతుంటే ఎంత బాధగా ఉంటుందో తెలిసిన మీరు ఆమెను బాధపెడుతున్నారు కదా?"

"వాడొక చవట!"

"చవట అని ఎవరిని అనొచ్చు? భార్య మరొకరితో తిరుగుతున్నట్టు తెలియనివాడా, తెలిసినా పట్టించుకోనివాడా? "

"నీవు నా జీవిత చరిత్ర రాయొచ్చేమో అక్షరాలు  నేర్చుకుని ఉంటే."

"అక్షరమాల నేర్చుకున్నా బెత్తం దెబ్బలు తిని. కానీ అలాంటి పనికిమాలిన పనులకు పూనుకొను. అంతకన్నా లాభదాయకమైన ఇలాంటి గౌరవప్రదమైన పనులున్నాయి చేసుకోడానికి."

"నీవు వచ్చిన పని ముగించుకుపోతే మంచిది కదా?"

రాయుడి గొంతు స్వల్పంగా  కంపిస్తుండగా అన్నాడు.

కుందేలు వేగం తగ్గించింది దొరికిపోదామన్న దృష్టితో; మరో నిమిషంలో చేతికందుతుంది.

"చిన్నప్ప గారి గురించీ విన్నారా ఎప్పుడన్నా?"

"ఆ పేరు ఎవరికి తెలీదు? కులగజ్జికి మారుపేరు."

"మా కులపెద్ద. నాకు బాగా తెలుసు. పరోపకార బుద్ధి మెండు – కాకపోతే అది మా కులానికే పరిమితం."

"ఐతే?"

"చెప్తా! అన్నట్టు మీ కులమేమిటి?"

"నీకు తెలిసి ఉండాలిగా! నాకు నిజానికి కులం లేదు. కులం అంటే నాకు మలంలా వినిపిస్తుంది."

"కులం లేకపోవడం ఏమిటి? తల్లిదో తండ్రిదో ఉండాలికదా?"

"మా తాత నాయనమ్మది కులాంతర వివాహం. మా అమ్మమ్మ, ఆమె మొగుడిదీ కులాంతర వివాహమే. మా అమ్మది, నాన్నదీ అంతే. నేను ఎన్నో కులాల సంగమాన్ని. మానాన్న తన తండ్రి కులంగా చెప్పుకున్నట్టే నేను మా నాన్న కులాన్ని నా కులంగా చెప్పుకోవాలి. కానీ అది తక్కువ కులంగా సంఘం భావిస్తోంది కాబట్టి దాన్ని నేను        చెప్పుకోను."

"సరే, కులం మీద మీకు నమ్మకం లేకపోతె అది తమ పాడె; నా పాడె అనుకోమన్నా నాకు అభ్యంతరం లేదు. నాకు ఉండేది కాదుకానీ ఇప్పుడు ఏర్పడక తప్పలేదు అది ఉపయోగపడుతుందని తెలిసి. మా కులపెద్దని మీరు అవమానిస్తూ మాట్లాడటం మా యావత్ కులాన్నీ అవమానించినట్టే. నిజానికి నేను చెప్పి నా కులం గుంపును వీధిలోకి రప్పించి మీ ఇంటిమీద రాళ్ళేయించగలను; పత్రికా ప్రకటనలు విడుదల చేయించగలను. అయినా దాన్ని నేను పట్టించుకో దలచలేదు. నాది కొన్ని విషయాలలో విశాల హృదయం. చిన్నప్ప గారు సమాజసేవకుడు. కులం సమాజంలో భాగమే. అలాంటి సేవకుడిని గజ్జి మనిషనడం సబబో కాదో మీ విజ్ఞతకే వదిలేస్తున్నా. కులం గురించీ మతం గురించీ మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గిరుంచుకుని మాట్లాడటం మనకు శ్రేయస్కరం."

"వర్ణ వ్యవస్థ మూలాలకు వెళ్లకుండా, ఇంతకూ చిన్నప్ప గారి ప్రస్తావన ఎందుకు తెచ్చావో చెబితే సంతోషిస్తా."

"చిన్నప్ప గారు నా కోర్కెపైన ముందే బసవయ్య గారితో మాట్లాడారు నాకు సహాయం చెయ్యమని; అది ఎలాంటి సహాయమో కూడా సవివరంగా తెలియజెయ్యడమే కాక ఆయన ఫోను నెంబర్ నాకు నాది ఆయనకూ ఇచ్చి నాకు ఎప్పుడు అవసరం పడితే అప్పుడు ఆయనతో మాట్లాడవచ్చని భరోసా ఇచ్చారు. బసవయ్య గారిని కులం గురించీ పంచను, ప్రాణాలనూ ఒదిలెయ్యమంటే ఎందుకు అని కూడా అనకుండా ఒదిలేస్తారు."

"డూ డూ బసవయ్య, డూ డూ గార్దభయ్య ఎవడో నాకు తెలియదు. ప్రపంచంలోని గొట్టం గాళ్ళందరూ నాకు తెలియాలని లేదు. తెలుసుకోవాలన్న ఆసక్తి అస్సలు లేదు. వాడు, నీ కులపెద్ద, నీవు ఏవో పన్నాగాలను పాములలా దేనిగురించో పన్నుతుంటే అవన్నీ నాకెందుకు చెబుతావు?"

"రాయుడు గారికి ఆడపిచ్చితో పాటు ఆవేశం పాలూ అధికంగా ఉందేమో అనిపిస్తోంది. ఎవర్నిబడితే వాళ్ళను వాళ్లెవరో కూడా తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా 'గొట్టం' గిట్టమ్ అంటే వారి పెదవికీ, పదవికీ చేటు. చిన్నప్ప అంటే ఎవరో తెలియదు, పోనిద్దాము. బసవయ్యంటే ఎవరో కూడా తెలియదు; ఈ అపరాధాన్నీ మన్నించ తగునా? కూపస్థ మండూక జీవితంలో భోగమే పరమార్థంగా బతుకుతున్నారు మీరు. స్త్రీ జననాంగమే జీవితమా? అవినీతిపరుడికి అవినీతి నిరోధక శాఖ సంచాలకుడి పేరే తెలియదంటే, వారి అవినీతి వారి మదాన్ని తారాస్థాయికి చేర్చిందనిపిస్తోంది."

తన ఫోనులో బసవయ్య నంబరునుకొట్టి ఆయనతో సవినయంగా మాట్లాడాడు అనంతం. ఒకసారి రాయుడి గారితో మాట్లాడండి, సార్, అన్నాడు. ఫోను రాయుడికి ఇచ్చాడు. అవతలినుంచీ ఏమి మాట్లాడాడో తెలియదు. అనంతం అడిగే సహాయాన్ని చెయ్యండి అని గంభీరంగా చెప్పంటాడు.

గతుక్కుమన్నాడు రాయుడు. మొహంలో కత్తివేటుకు రక్తపు చుక్కలేదు. వీడు తన మెడకు ఉచ్చు వేసి అనుక్షణం బిగిస్తున్నాడు. నిగ్రహం తాను కోల్పోయేట్టు చేస్తున్నాడు. లోకంలో సింహాచలాలు, అప్పారావులూ 'కో' అంటే కోటిమంది. బసవయ్యలూ అనేకురు. అందరు బసవయ్యలూ అవినీతి నిరోధక శాఖ సంచాలకులు కాదుగదా ఆ పేరు చెప్పగానే అతగాడు ఇతగాడు అని అరక్షణంలో గుర్తుకురావడానికి? మౌనంగా ఉండిపోయాడు. ముందు చెప్పినదాన్ని కాలిన ఇనుము మీద ఎన్ని దెబ్బలు ఎంతగా కొట్టగలిగితే అది అంతగా రూపు దిద్దుకుంటుంది. అనంతం కొనసాగించాడు

"రాబడికి మించిన ఆస్తి సంపాదించినవాళ్లు అణిగిమణిగి ఉండాలి గాని తోకను అధికంగా జాడించకూడదు. పురుపురుష అంగానికి కాకపోయినా, నోటికి కళ్లెం వేసుకుని బతకాలి మాటకు సంబంధించినంత వరకూ. తిండి విషయంలో ఎంతైనా స్వేచ్ఛ ఇచ్చుకోవచ్చు; అదీ కడుపు ఆ స్వేచ్ఛ ఏమేరకు ఉండాలో తేల్చుకో వచ్చు. అవినీతి శాఖ వాళ్ళను భక్తితో తలుచుకుని, వీలయితే కొలుచుకుని వాళ్లకు అర్పించాలిసినదాన్ని అర్పిస్తే మనకు మంచి జరుగుతుంది. వాళ్ళవి ఎంతటి దూరాన్నుంచైనా దేన్నైనా గమనించగల డేగ కళ్ళు, పానకాలస్వామి ఉదరం. వాళ్ళవి దేన్నైనా ముక్కలు చేయగల ఉక్కుపళ్ళు. వాళ్ళవి ఎంత దూరాన చీమ చిటుక్కుమన్నా వినగల పాముచెవులు. వాళ్ళది ఎంతటి దూరపు కంపునైనా వాసన పట్టగల గద్ద ముక్కు; దానితో చీల్చి చెండాడగలరు. ఎటొచ్చి పంజరంలోని పక్షులు. ఐతే పంజరం అన్ని

విషయాలలోనూ, అందరి విషయంలోనూ జోక్యం చేసుకోక పోవచ్చు. అది తరతమ భేదాల మీద ఆధారపడుంటుంది. పంజరంలో దాన్నుంచినవారి వర్గంలో చేరక పోతే ఆ పక్షి నిన్ను వెంటాడుతుంది. తమ వర్గం వాడైతే నీపై ఆ పక్షి గుడ్డికంటినీ సారిస్తుంది. దాని వ్యవహారం మీకు బాగా తెలుసు ప్రభుత్వ అధికారిగా. నేను చెప్పడం తాతకు దగ్గులూ, మూలుగులూ, అపానవాయువులూ నేర్పినట్టవుతుంది. కాలం వృథా చెయ్యను. వీధి గాడినే అయినా నాకూ కాలం విలువైనదే అవినీతి అధికారికంత కాకపోయినా. డేగకు పదునైన ముక్కుంటుంది. మీరు ఒకేసారి చావడమనే అదృష్టానికి నోచుకోకుండా పొడిచిపొడిచి మీ ప్రాణాలు గాలిలో లీనమయ్యేలా చేస్తుంది ఏ మంత్రో అడ్డుపడకపోతే. మీ అవినీతి సొమ్మునంతా పణంగా పెడితేనే కానీ మంత్రి సాయం చెయ్యడు. కాలం ఎవడబ్బ సొమ్మూ కాదు. అలా అని ఎవరిదీ కాకుండానూ పోదు. అది ప్రవాహం. వెనుదిరగడం తనకే సాధ్యం కాని ప్రవాహం – మనందరం కొట్టుకుపోతూనే ఉంటాము తుమ్మెదలమెట్ట చేరేవరకూ. అన్నట్లు గొట్టంగాడు అంటే అర్థం ఏమిటట? మీకు తెలియదని నాకు తెలుసు. నాకూ తెలియదు. మనకు తెలియని పదాలను రువ్వడం మనకు ప్రమాదకరం. పదాలు ఎంతటి ప్రమాదాలకు దారితీయవచ్చో 'విప్రనారాయణ' అని నేను పిలుచుకుంటూ వచ్చిన తెలుగు పండితులవారు పొరబాటున చెప్పారు. విషయించడం వేరు, విషమించడం వేరు, విషయం వేరు అని. మీలా నోరు జారీ ఆయన చెప్పినపుడు – విషయం అన్నా, విషమించడం అన్నా మాకు తెలుసు కానీ విషయించడం ఏమిటో తెలియదు అని వారితో అన్నాను; నిజంగానే ఆ మాట అర్థం తెలియక. కంగు తిన్నాడాయన. తరువాత, దానర్థం అది ఎలా చెయ్యాలో అది చేయవలసిన కాలం ఆసన్నం అయేదాకా తెలియనక్కరలేదు అన్నాడు; బెత్తంతో కొట్టాడు. ఈ లోపల తెలియాలంటే మీ తండ్రులనడగండి అన్నాడు. ఆయనకూ ఒక దేవయాని ఉండేది. ఆమె ఆడపిల్లలకు డ్రిల్లుచెప్పేది. ఆమెను చూస్తే మాకే మతులు పోయ్యేవి. ఆమె డ్రిల్లులో ఎగిరితే అదిగదిగో గగనసీమా అని పాడుతూ నాట్యం చేస్తున్నట్టుండేది.”

అతను లేచాడు. అతను ఎందుకు లేచింది గ్రహించాడు అనంతం.

" మరో పళ్లెం ఎందుకు, సార్? పళ్లెం మీద మూత వేశారు కదా దీంతో నేను సర్దుకో గలను."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS